'ప్రధాని ఒక్కరోజు సెలవు తీసుకోలేదు'



సింధికాలనీలో ఎన్నికల ప్రచారంలో కిషన్‌రెడ్డి, చిత్రంలో మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: గడిచిన పదేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా దేశం కోసం పనిచేసిన ప్రధాని ఒక్క నరేంద్రమోదీనేనని, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అన్నారు. మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్ పరిధిలోని సింధికాలనీలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో మోదీకి ప్రత్యామ్నాయం ఎవరూ లేరన్నారు. ఏ ఇంట్లో చూసినా.. ఎవరి నోట విన్నా.. ఒక్కటే మాట మోదీ అన్నారు. మోదీ హయాంలో దేశంలో మాఫియా, గూండాయిజం లేదని, కర్ఫ్యూలు, అల్లర్లు లేవని, దేశం శాంతియుతంగా ఉందని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. మోదీ ప్రధానిగా ఉంటేనే దేశం భద్రంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందేనని, అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ మొత్తం ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. అందుకే ఆయనను రాష్ట్ర ప్రజలు ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. మహిళలకు రూ.2,500 రావడం లేదన్నారు. నిరుద్యోగులకు భృతి లేదని, కొత్త రేషన్ కార్డులు రాలేదన్నారు. కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు..పెంచుతానని హామీ ఇచ్చిన పెన్షన్ల పెంపు లేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని, వీటికి ఓటు వేస్తే వృథా అన్నారు. రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీర సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం కల్పించండి..

రాంగోపాల్‌పేట్: గత పదేళ్ల నుంచి పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు బీజేపీకి ఓటువేసి గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన సింధీకాలనీ, నల్లగుట్ట, పాన్‌బజార్, సుభాష్‌రోడ్ తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జీపు యాత్ర చేశారు. మహంకాళి దేవాలయం వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. కరోనా సమయంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా వ్యాక్సినేషన్ చేయించి కోట్ల మందిని కాపాడారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 80 కోట్ల మంది పేదలకు అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. మరో ఐదేళ్లు ఈ పథకం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా 13 కోట్ల మరుగుదొడ్లు నిర్మించామన్నారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నిర్మాణం, వైజాగ్, తిరుపతి బెంగుళూరుకు సికింద్రాబాద్ నుంచి వందేభారత్ రైళ్లు ఇచ్చారని చెప్పారు. బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యామ్‌సుందర్‌గౌడ్, కార్పొరేటర్లు చీర సుచిత్ర, కొంతం దీపిక, సరళ, చీర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదు

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్



బీఆర్ఎస్ శ్రేణులకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: కేంద్రమంత్రి హోదాలో ఉండి సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టని బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మరోసారి ఓటు అడిగే అర్హత లేదని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం మధురానగర్ రాఘవగార్డెన్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ప్రజల ఇబ్బందులు తీర్చడం కోసం కిషన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు వివరించాలని ప్రశ్నించారు గత ఎన్నికల సమయంలో అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ నిర్మిస్తానని హామీ ఇచ్చిన కేంద్రమంత్రి ఇప్పటి వరకు నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. ప్రజా సమస్యలు పక్కన పెట్టి దేవుళ్ల పేర్ల చెప్పుకుంటున్నారని విమర్శించారు. అధికారం కోసం తరచూ పార్టీలు మార్చే కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. పదేళ్లలో నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తాను ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశానన్నారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను దూరం చేశానని, మెజారిటీ ఎమ్మెల్యేలు తమ పార్టీకి చెందినవారే ఉన్నందున ఎంపీగా తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీగా పోటీ చేస్తున్న తనకు సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ప్రజలు అండగా ఉండి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్నలక్ష్మి, రాసూరి సునీత, శైలజ, బీఆర్ఎస్ నాయకులు రామేశ్వర్‌గౌడ్, ఆలకుంట హరి, లింగాని శ్రీనివాస్, కరాటే రాజు, కంది నారాయణ, సుంకు రాంచందర్, మల్లూరి అనిల్, రాజసుందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై బాలికలకు అవగాహన సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: రోడ్డు భద్రతపై బాలికలకు అవగాహన సదస్సు జరిగింది. సోమవారం ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఎస్ఎస్ఎస్ పీఓల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ రవీందర్‌తో పాటు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, సీపీ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. ఓయూ పరిధిలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన బాలికలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సివిల్స్ ర్యాంకర్లకు వీసీ సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: సివిల్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన ఓయూ విద్యార్థులను వీసీ ప్రొఫెసర్ రవీందర్ సన్మానించారు. సోమవారం సివిల్స్‌లో 82వ ర్యాంకు సాధించిన సివిల్ ఇంజినీరింగ్ 2020 బ్యాచ్ విద్యార్థి మెరుగు కౌశిక్, 545వ ర్యాంకు సాధించిన ఎంఏ పొలిటికల్ సైన్స్ విద్యార్థి నరేంద్రపటేల్‌ను సన్మానించారు. ఇద్దరు విద్యార్థులు సివిల్స్ ర్యాంకులు సాధించడం ఓయూకు గర్వకారణమన్నారు. మెరుగు కౌశిక్‌ను ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ సన్మానించారు. ఓయూ సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: సంజీవయ్య పార్కు–జేమ్స్‌స్ట్రీట్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన కలికాంత్ ఠాగూర్ (49) నగరంలో ఉంటూ.. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. సోమవారం సికింద్రాబాద్ చేరుకున్న కలికాంత్ హైదరాబాద్–చెన్నై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆధార్ కార్డు ఆధారంగా మృతుడిని గుర్తించిన పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

పరామర్శ



అమీర్‌పేట : తన నివాసంలో నిరసన దీక్ష చేపట్టి అనారోగ్యానికి గురైన మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులును ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పరామర్శించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి డిశ్చార్జ్ అయిన మోత్కుపల్లిని సోమవారం ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు చేసిన అన్యాయాన్ని మాదిగ సమాజం గమనించాలని మందకృష్ణ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వర్గీకరణకు ముందుకొచ్చే పార్టీకు మాదిగలు మద్దతివ్వాల్సిన అవసరం ఉందన్నారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) అధ్యక్షులు నామ సైదులు సోమవారం పేర్కొన్నారు. ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కాలేజీలు నిజాం, సికింద్రాబాద్ పీజీ కాలేజీ, సైఫాబాద్, కోఠి మహిళ కళాశాలలకు చెందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కాకతీయ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ అమర్‌నాథ్ పర్యవేక్షణలో సివిల్స్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వివరాలకు 9160571483, 9182399858.

కంటోన్మెంట్ అసెంబ్లీకి నామినేషన్లు..



కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీగణేశ్..



బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున గోపాల్..



బీజేపీ నుంచి శ్రీనివాస్ నామినేషన్ దాఖలు..

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఒక అభ్యర్థి రెండు సెట్‌లు నామినేషన్ వేయగా.. మొత్తంగా ఒకేరోజు 10 నామినేషన్‌లు దాఖలయ్యాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల తరఫున నామినేషన్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీగణేశ్, బీఆర్ఎస్ అభ్యర్థిగా నివేదిత (ప్రతినిధి ద్వారా), బీజేపీ అభ్యర్థిగా ఎం.ఏ. శ్రీనివాస్‌లు నామినేషన్లు వేశారు. బీజేపీ తమ అభ్యర్థిగా టీఎన్. వంశీతిలక్‌ను ప్రకటించగా.. ఎం.ఏ. శ్రీనివాస్ నామినేషన్ వేయడం గమనార్హం. బహుజన్ ముక్తి పార్టీ తరఫున రాజేందర్, ఇండిపెండెంట్ అభ్యర్థులు రాజ్‌కుమార్, ఎం. సంజీవులు, బండారు నాగరాజు, సైదులు, రత్నం నామినేషన్లు వేశారు.

'డబుల్' అవినీతిపరులు జైలుకెళ్తారు !

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వ్యవహారంలో అవినీతికి పాల్పడిన వారంతా జైలుకు వెళ్లడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మారేడుపల్లికి చెందిన బీఆర్ఎస్ నేత, సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిర్రబోయిన సంతోష్‌యాదవ్ మైనంపల్లి హన్మంతరావు, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మైనంపల్లి మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో కొందరు దివంగత సాయన్న పేరుకు మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్యంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు, దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టమన్నారు. కంటోన్మెంట్‌లో శ్రీగణేశ్‌ను అసెంబ్లీకి పంపించడం ఖాయమని శపథం చేశారు. గణేశ్‌ను గెలిపించుకోలేకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఓట్లు అడిగే హక్కు లేదు



మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌కు ఎలాంటి నిధులు ఇవ్వని బీఆర్ఎస్‌కు కంటోన్మెంట్‌లో ఓట్లు అడిగేహక్కులేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ (ఆర్కే) ఆరోపించారు. గత ఐదేళ్లుగా మల్కాజ్‌గిరి ఎంపీగా ఉండి కంటోన్మెంట్‌కు ఏమాత్రం సహకారం అందించని ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి సైతం కంటోన్మెంట్‌లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ బకాయిపడిన టీపీటీ నిధులను కేటాయించడాన్ని కాంగ్రెస్ నేతలు తమ గొప్పతనంగా చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. గతంలో తాను టీపీటీ బకాయిల కోసం కోర్టుకు వెళ్లడంతోనే టీపీటీ బకాయిలు విడుదల చేయాల్సిందిగా హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఈ మేరకే తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం టీపీటీ బకాయిలు విడుదల చేసిందన్నారు. తాను కంటోన్మెంట్‌లో రూ.30 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. దేశ వ్యాప్తంగా మోదీ హవా కొనసాగుతోందని, బీజేపీ అభ్యర్థి వంశ తిలక్ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

తొమ్మిది నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న పిరమిడ్‌పార్టీ అభ్యర్థి బొమ్మకంటి సౌమ్య

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నిక కోసం సోమవారం మరో తొమ్మిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో 7 మంది స్వతంత్ర అభ్యర్థులు కాగా.. మిగతా ఇద్దరు వేర్వేరు పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బొమ్మకంటి సౌమ్య, ధర్మ సమాజ్‌పార్టీ అభ్యర్థిగా రాసాల వినోద్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సయ్యద్‌ఖదీర్, మంచెర్ల వెంకటరెడ్డి, మురళీకృష్ణ, సంగాల ఫ్లోరీ, కొన్నె దేవేందర్, కృపావరం గందు, పొన్నపట్టి చిన్న లింగన్న తమ నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్‌కు అందజేశారు. మొత్తం నామినేషన్ల అభ్యర్థుల సంఖ్య 18కి చేరింది.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

సికింద్రాబాద్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనాథ్ కోరారు. సోమవారం సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు, వారాసీగూడ, బౌద్ధనగర్ ప్రాంతాల్లో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనాథ్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని వసతులు ఏర్పాటు చేశామని వివరించారు. ఓటర్ల చిరునామాకు అనుగుణంగా సమీపంలోని పోలింగ్ బూత్‌లో ఓటువేసే సదుపాయాన్ని కల్పించామన్నారు. బూత్‌లలో మహిళలకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు గంటల తరబడి బారులు తీరే ఇబ్బందులను మొత్తం దూరం చేశామని పేర్కొన్నారు. ఓటర్లలందరూ పోలింగ్ తేదీన పోలింగ్ కేంద్రాలకు వచ్చి స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. అర్బన్ కమ్యూనిటీ ఆఫీసర్ ధనశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో బూత్‌లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి పటిష్ట బందోబస్తు

డివిజన్ పరిధిలో 35 పోలీస్ పికెట్లు



ఏసీపీ జైపాల్‌రెడ్డి

చిలకలగూడ: హనుమాన్ జయంతి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ ఠాణాల పరిధిలోని 35 సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ పరిధిలో 27 ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు, 15 శోభాయాత్రలు జరుగుతాయన్నారు. ఆయా దేవాలయాలు, శోభాయాత్ర జరిగే ప్రధాన రహదారుల్లో ప్రత్యేక నైట్‌విజన్, హైరిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మూడు ప్లటూన్ల సాయుధ బలగాలతో పాటు, స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిఘా బృందాలను రంగంలోకి దించామన్నారు. కీసర, మల్కాజ్‌గిరి నుంచి వచ్చే శోభాయాత్ర లాలాగూడ మీదుగా, ట్యాంక్‌బండ్, చిలకలగూడల్లో ప్రారంభమయ్యే శోభాయాత్రలు స్థానిక పురవీధుల మీదుగా గౌలిగూడకు చేరుకుంటాయని వివరించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ ఆదేశాల మేరకు ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేపట్టామన్నారు. శోభాయాత్రలు, ర్యాలీలు త్వరితగతిన పూర్తి చేసి ఏసీపీ జైపాల్‌రెడ్డి ప్రజలను కోరారు.

హనుమాన్ విజయోత్సవ వేడుకలకు ఆహ్వానం



అడ్డగుట్ట: హనుమాన్ జయంతి సందర్భంగా అడ్డగుట్ట హనుమాన్ భక్త సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలు, శోభయాత్రకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సమితి సభ్యులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం హనుమాన్ జయంతోత్సవానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌లను ఆహ్వానించారు. మధ్యాహ్నం జయంతి వేడుకలు సాయంత్రం హనుమాన్ విజయోత్సవ శోభాయాత్ర ఉంటుందని ప్రకటించారు. సమితి సభ్యులు ఉదయ్, శివాజీ, రాజు, శ్రీకాంత్, నరేష్ తదితరులున్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలు..

సనత్‌నగర్: మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు, వీవీప్యాట్లు స్ట్రాంగ్‌రూమ్‌కు వచ్చేశాయి. ప్రధాన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ అయిన విక్టరీ ప్లే గ్రౌండ్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ భవనంలోని స్ట్రాంగ్‌రూమ్‌కు చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున పటిష్ట బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లను తరలించారు. ఈ నేపథ్యంలో స్ట్రాంగ్‌రూమ్ లోపల, బయట సీసీ కెమెరాలను అమర్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లను భద్రపరిచిన అధికారులు స్ట్రాంగ్ రూమ్‌ను సీజ్ చేశారు. 24 గంటలు పహారా కాసేందుకు ప్రత్యేక సాయుధ బలగాలను మోహరించారు.

229 పోలింగ్ బూత్‌లు..

సనత్‌నగర్ నియోజకవర్గంలో 229 పోలింగ్ బూత్‌లు ఉండగా.. ఈవీఎం, వీవీ ప్యాట్లను స్ట్రాంగ్‌రూమ్‌కు చేర్చారు. రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ తొలివిడత పూర్తిచేసిన వీటిని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. ఎక్కడైనా ఈవీఎంలు, వీవీప్యాట్లు మొరాయిస్తే వాటిని రీప్లేస్ చేసేలా 35 శాతం అదనంగా అందుబాటులో ఉంచారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను 25 శాతం అదనంగా తెప్పించారు. మే13న సికింద్రబాద్ పార్లమెంట్ ఎన్నిక సందర్భంగా 12 నుంచే ఇక్కడ రిసెప్షన్ ఏర్పాటు చేసి సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను పంపిణీ చేస్తారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద పికెటింగ్ ఏర్పాటుతో పాటు సాయుధ బలగాల మోహరింపు, సీసీ కెమెరాల మధ్య పటిష్ట భద్రత కొనసాగనుంది.

'హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం'

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: అధికారంలోకి వచ్చి 4 నెలలు అవుతున్న ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసగించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసం వద్ద ఎమ్మెల్యే నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచార రథాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ప్రజలకు ఏం చేశారని మీకు ఓట్లేయాలో చెప్పాలని కాంగ్రెస్, బీజేపీ నాయకులను తలసాని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని ఆచరణ సాధ్యం కాని హామీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 4 నెలలు కావస్తున్నా.. ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలుచేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చెప్పాలంటే వందకు పైగా ఉన్నాయని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు తాము చేసిన అభివృద్ధి ఒక్కటైనా చెప్పగలరా? అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలు సైతం సంతోషంగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో రంజాన్, క్రిస్మస్ తదితర పండుగలకు నూతన వస్త్రాల గిఫ్టులను పంపిణీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనుల గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజల మధ్య ఉండే పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ పార్టీ అభ్యర్థి పద్మారావుగౌడ్ హాజరవుతారని చెప్పారు. 25న జరిగే సమావేశానికి వివరాలతో హాజరుకావాలని పార్టీ ముఖ్య నాయకులకు సూచించారు. కార్పొరేటర్లు కొలను లక్ష్మి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, ఆకుల రూప, నాయకులు కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేషన్‌రాజు, హన్మంతరావు, ఆకుల హరికృష్ణ, స్కైలాబ్ యాదవ్, అశోక్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నాగులు, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, రమణ, కూతురు నర్సింహ, గోపీలాల్‌చౌహాన్, బాసా లక్ష్మీలలితాచౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సాయన్న బిడ్డను గెలిపించండి !



మాట్లాడుతున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెను గెలిపించాలని మహిళలకు మాజీ మంత్రి మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. సిఖ్ విలేజ్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో నిర్వహించిన మహిళా సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి వేలాదిగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి మల్లారెడ్డి మాట్లాడుతూ.. "మీకు దండం పెడతా.. కాల్మొక్తా.. సాయన్న బిడ్డను గెలిపించండి" అంటూ మహిళా ఓటర్లను అభ్యర్థించారు. తాను కూడా బోయిన్‌పల్లిలోనే ఉంటానని, నిత్యం కంటోన్మెంట్ ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. నివేదిత ప్రసంగానికి వచ్చిన సందర్భంగా తన తండ్రి సాయన్న, సోదరి లాస్య నందితలను తలుచుకుని కంటతడి పెట్టడంతో ఒక్కసారిగా సభా ప్రాంగణం సైలెంట్ కావడంతో పాటు సభికులు భావోద్వేగానికి గురయ్యారు. గద్దర్ పేరిట అవార్డులు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆయన బిడ్డ వెన్నెలకు టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన సాయన్న కుటుంబానికి సొంతిల్లు కూడా లేదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సత్కారం



గురుకులాలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. ఈ పాఠశాల నుంచి గురుకులకు ప్రవేశ పరీక్ష కోసం పలువురు విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణను ఇచ్చారు. నిరుపేద విద్యార్థులను ఎంపిక చేసి వారికి కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేయడంతో పాటు ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణతో గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాల నుంచి 13 విద్యార్థులు గురుకులాలకు ఎంపికయ్యారు. సోమవారం గురుకులకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మల్లికార్జున్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. మేకలమండి ప్రభుత్వ పాఠశాల నుంచి సుమారు 70 విద్యార్థులు ఆయా గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్నారని, పేద విద్యార్థుల విద్యతోపాటు క్రీడల్లో కూడా వారు రాణించేలా స్వచ్ఛంద సంస్థలతో కలిసి శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం..

గాంధీఆస్పత్రి : గురుకుల పాఠశాలకు ఎంపికైన చిన్నారి విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు ఔదార్యం చాటుకున్నారు. బన్సీలాల్‌పేట డివిజన్ మేకలమండి ప్రభుత్వ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. మెడికల్ సర్టిఫికెట్ల కోసం వారు సోమవారం గాంధీ ఆసుపత్రికి రాగా.. సూపరింటెండెంట్ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తనవంతు సాయంగా ఆర్థికసాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు.